సాక్షి
ప్రకాశం
గురువారం । 26 । జనవరి । 2023



బలంగా సాక్ష్యాలు..8 కేసుల్లో శిక్షలు

జిల్లాలో బాలికలు, మహిళలపై లైంగికదాడి కేసులను ఎస్పీ మలికాగర్గ్ పర్యవేక్షణలో పోలీసులు ఛేదిస్తున్నారు. 13 నెలల్లో 8 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. - 8లో..



కుమారుడి చేతిలో తల్లి హతం

కన్నకొడుకే తల్లిని హత్య చేసిన దారుణ ఘటన పుల్లలచెరువు మండలం తెల్లగట్ల గ్రామంలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
30 /19

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.





గణతంత్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌ను అధికారులు ముస్తాబు చేశారు. అతిథులకు తగినట్లుగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. పోలీసు పరేడ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. – ఒంగోలు

న్యూస్‌రీల్

ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఒంగోలు: రాష్ట్ర ప్రజలకు ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీమంత్రి శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో 74వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగం మన దేశంలో అమలులోకి వచ్చిందని, 1950 జనవరి 26వ తేదీనుంచి భారత్ సర్వ స్వాతంత్ర్య, సామ్యవాద, లౌకిక, ప్రజా స్వామ్య, గణతంత్ర రాజ్యాంగంగా అవతరించిందని అన్నారు. అప్పటి నుంచి ఏటా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొంటూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీఆర్‌సెట్‌లో 13వ ర్యాంకు



షేక్ ఇస్మాయిల్ అలీబాషా

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్‌అలీ ఏపీఆర్‌సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు. ఇటీవల జరిగిన ఏపీఆర్ సెట్ 2022లో వృక్షశాస్త్రం విభాగంలో 13వ ర్యాంకు సాధించాడు.

పలువురు వీఆర్ ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్

ఒంగోలు టౌన్: వీఆర్‌లో ఉన్న పలువురు ఎస్‌ఐలను వివిధ విభాగాలకు అటాచ్ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉండి సీసీఎస్‌కు అటాచ్ చేసిన పులి శివ నాగరాజును డీసీఆర్‌బీకి అటాచ్ చేశారు. బి.ఫణి భూషణ్‌ను డీసీఆర్‌బీకి, సీహెచ్ శివ బసవరాజును సీసీఎస్‌కు అటాచ్ చేశారు. అలాగే బి.నరసింహారావును సీసీఎస్ కు, ఎస్.మల్లికార్జునరావును ఒంగోలు తాలూకా పీఎస్ కి, వై.నాగరాజును డీటీసీకి, ఒంగోలు తాలుకా పీఎస్‌లో ఉన్న బి.అజితను గిద్దలూరు ఎస్‌ఐకు అసిస్ట్‌గా అటాచ్ చేశారు. ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు.

ప్రశాంతంగా డీఈడీ పరీక్షలు


ఒంగోలు: స్థానిక సెయింట్ థెరెస్సా ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన డీఈడీ మొదటి సంవత్సరం పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 163 మందికిగాను 152 మంది హాజరయ్యారు. స్థానిక శర్మా కాలేజీలో జరుగుతున్న తెలుగు పండిట్ 2019–20, 2020–21 బ్యాచ్‌లకు సంబంధించి ఉదయం జరిగిన పరీక్షకు 135 మందికిగాను 107 మంది హాజరయ్యారు. సాయంత్రం జరిగిన పరీక్షకు 137 మందికిగాను 109 మంది హాజరయ్యారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

ఒంగోలు: స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ కౌన్సెలింగ్‌పై దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధి, శిక్షణ అధికారి భరద్వాజ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆర్.లోకనాథం ముఖ్యఅతిథులుగా హాజరై అవగాహన కల్పించారు. భరద్వాజ మాట్లాడుతూ యువత మొబైల్ ఫోన్, ఇంటర్‌నెట్ వలలో పడకుండా సరైన మార్గంలో ఎలా నడుచుకోవాలో తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రకాలైన జాబ్ మేళాలు, ఉచిత ట్రైనింగ్స్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డి.కళ్యాణి, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దర్శి దాహార్తి తీరేలా..

దర్శి పట్టణవాసుల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రజలు పడుతున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రూ.121 కోట్లు మంజూరు చేశారు. రానున్న 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక టెండర్లు పిలవడమే తరువాయి. దీనిపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దర్శి పట్టణ వ్యూ

- గట్టెక్కనున్న తాగునీటి కష్టాలు
- దర్శిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం జగన్
- నీటి సమస్య పరిష్కారానికి రూ.121 కోట్ల నిధులు మంజూరు
- 50 ఏళ్ల ముందు చూపుతో ప్రణాళికలు
- పులిపాడు చెరువులో మిగులు భూమి 96 ఎకరాలు కేటాయింపు
- చెరువు కింద పొలాలకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

దర్శి: దర్శి పట్టణంలో 33,500 మంది జనాభా నివశిస్తున్నారు. అధికారికంగా పన్ను చెల్లిస్తున్న నివాసాలు 8,800 ఉండగా అనధికారికంగా 10 వేలకు పైగానే ఉన్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఉన్న నిమ్మలబావి కనెక్షన్లు 600, ఆర్‌డబ్ల్యూఎస్ కనెక్షన్లు 60, వీధి కుళాయిలు మరో 960 ఉన్నాయి. ప్రస్తుతం మూడు రోజులకు ఒక సారి నీరు అందుతోంది.

50 ఏళ్ల నీటి ఇబ్బందులు అధిగమించేలా:
మరో 50 ఏళ్ల ఇంటింటికీ కుళాయి నీరు ఇచ్చి నీటి ఇబ్బందులు అధిగమించేలా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ఈ ఎస్‌ఎస్ ట్యాంక్‌లో 1600 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. రోజుకు 9 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేలా ప్రణాళికలు చేశారు. రోజుకు ఒక వ్యక్తికి 135 లీటర్ల నీరు సరఫరా చేస్తారు.

కేటాయింపు ప్రణాళికలు ఇలా..
ఈ ప్రాజెక్టుకు రూ.121 కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేశారు. నాలుగు విభాగాలుగా పనులకు ప్రణాళికలు రూపొందించారు. సాగర్ కాలువ నుంచి ఎస్‌ఎస్ ట్యాంక్ (సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్)కు నీరు రావడానికి, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్, ఫుట్ బ్రిడ్జి, ఇంటేక్ వెల్ ల నిర్మాణానికి, నీటి సరఫరా లైన్‌లకు, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణాలకు రూ.8938.67 లక్షలు కేటాయించారు. రెండో విభాగంలో 7 సంవత్సరాల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ.660.85 లక్షలు కేటాయించారు. మూడో విభాగంలో జీఎస్టీ ఇతర చార్జీలు రూ.1752.64 లక్షలు కేటాయించగా నాలుగో విభాగంలో ఏపీఎస్‌పీ డీసీఎల్, ప్రైజ్ వేరియేషన్స్, కన్సల్టెన్సీ చార్జెస్, ల్యాండ్ కేటాయింపునకు, ఇతర అవసరాలకు రూ.747.84 లక్షలు మంజూరు చేశారు.



నూతన ప్రాజెక్ట్ నిర్మించనున్న పులిపాడు చెరువు

ఈ ప్రాజెక్టును దర్శి పట్టణాన్ని ఆనుకుని ఉన్న ముండ్లమూరు మండలం పులిపాడు చెరువు వద్ద నిర్మిస్తారు. ఆ చెరువుకు మొత్తం 250 ఎకరాలు భూమి ఉంది. చెరువు నిండితే 120 నుంచి 150 ఎకరాల భూమిలో నీరు నిల్వ ఉంటుంది. 100 ఎకరాల నుంచి 130 ఎకరాల వరకు చెరువుకు మిగులు భూమి ఉంది. అందులో 96 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టుకు సేకరించారు. ప్రత్యేకంగా రావాటర్ స్టోరేజ్ ట్యాంక్, నీటి శుద్ధి కర్మాగారాలు, స్టాఫ్ క్వార్టర్స్ వంటి సౌకర్యాలకు భూమిని ఉపయోగిస్తారు. సాగర్ కుడి కాలువ నుంచి నేరుగా చెరువులోకి నీరు వచ్చేలా పైప్ లైన్ ఏర్పాటు చేసి ఆ నీటిని శుద్ధి ప్లాంట్‌లో శుద్ధి చేసి పైప్‌లైన్‌ల ద్వారా పట్టణంలోని ఇంటింటికీ నీటి సరఫరా చేస్తారు.

వీధి పంపులకు చెక్:
ప్రస్తుతం మంజూరైన ప్రాజెక్ట్ పూర్తయితే మహిళలు వీధి కుళాయిల వద్ద లైన్‌లో నిలబడి నీరు పట్టుకోవాల్సిన పని లేదు. నేరుగా ఇంట్లోకే తాగు నీరు పైప్ లైనుల ద్వారా చేరేలా ప్రణాళికలు చేశారు. వారి సమయం కూడా వృథా కాదు. పాత పైప్ లైనులు బాగున్న చోట అవే లైన్‌లు ఉంచి, నీరు అందని ఎత్తు పల్లాల వద్ద నూతన పైప్ లైన్‌లు వేస్తారు. దీంతో ప్రతి ఇంటికి నీరు కచ్చితంగా చేరుతుంది.

పరోక్షంగా పట్టణ అభివృద్ధి:
తాగునీటి ఇబ్బందులు అధిగమిస్తే నివాసాలు ఉండే వారు ఎక్కువ చొరవ చూపుతారు. దీంతో దర్శిలో నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎక్కువ మొగ్గు చూపే అవకాశం ఉంది. తద్వారా పట్టణం కూడా వ్యాప్తి చెందుతుంది.

శిథిలావస్థలో నెదర్లాండ్ చెరువు

35 సంవత్సరాల క్రితం సాగర్ కాలువ నిర్మించినప్పుడు ఏర్పాటు చేసిన తాగునీటి రిజర్వాయర్ మాత్రమే ప్రస్తుతం ఇక్కడ ఉంది. అప్పటి జనాభా ప్రకారం ప్రణాళికలతో నిర్మించిన నిర్మాణాలు, పైపులైన్‌లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. దీంతో పట్టణం తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నూతన ప్రాజెక్ట్ పూర్తయితే ఇబ్బందులను అధిగమించవచ్చు.



31వ డివిజన్ సంజయ్‌గాంధీ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

మంచినీటికి రూ.339 కోట్లు మంజూరు

- రూ.200 కోట్లతో పేదల ఇళ్ల కోసం భూములు కొనుగోలు చేస్తున్నాం
- మార్చిలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు అందజేత
- సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పంపిణీకి రంగం సిద్ధం
- రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన
- 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర ప్రజల చిరకాల కోరిక శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ రూ.339 కోట్లు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని 31వ డివిజన్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ కళాశాల వెనుకవైపు సంజయ్ గాంధీ నగర్, సీఆర్‌పీ క్వార్టర్స్, గాయత్రి నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వస్తున్న తీరును స్వయంగా బాలినేని స్థానికులకు వివరించారు. నూతనంగా మంజూరైన నిధులతో నగరంలో కొత్తగా 18 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు నగరం మొత్తం కొత్త మంచి నీటి పైపులైన్లు వేసి మంచినీటి సమస్యకు చెక్ పెడతామని భరోసా ఇచ్చారు. రూ.200 కోట్లు వెచ్చించి ప్రైవేటు భూములు కొనుగోలు చేయటానికి ఇప్పటికే రంగం సిద్ధమైందన్నారు. నగరంలోని దాదాపు 25 వేల మంది ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు. భూముల కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తి చేసి మార్చినెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పేదల కోసం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడవద్దని సీఎం వైఎస్ జగన్ చెప్పారన్నారు. పేదలకు ఇచ్చిన మాట కోసం ఎందాకైనా తగ్గేదేలే అని బాలినేని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు చేసిన నిర్వాకానికి ప్రైవేటు భూములు కొనుగోలు చేసిమరీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. టీడీపీ మాదిరిగా ఆర్భాటాలకు పోయే ప్రభుత్వం మాది కాదని, వాస్తవ సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా సంజయ్ గాంధీ నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన మంచినీటి పైపులైన్ పనులకు బాలినేని టెంకాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. స్థానికులు బోరు కావాలని బాలినేనిని అడగటంతో వెంటనే కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు చెప్పి బోరు వేయించాలని ఆదేశించారు. వారం రోజుల్లో బోరు వేస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. తొలుత సంజయ్ గాంధీ నగర్ వినాయకుని గుడిలో బాలినేని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు కొమ్మూరి రవిచంద్ర నివాసంలో ప్రార్థనలు చేశారు. తరువాత నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోసు వెంకటేశ్వర్లు ఇంట్లో కొంతసేపు గడిపి, స్థానిక సమస్యలను బాలినేని ఆలకించారు.

కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, గంటా రామానాయుడు, కార్పొరేటర్లు యనమల నాగరాజు, ఈదర చిన్నారి, గోపీ చంద్, ట్రేడ్ యూనియన్ నాయకులు జాజుల కృష్ణ, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరి రవిచంద్ర, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, ఊసా మధు బాబు, బైరెడ్డి అరుణ, పల్లా అనూరాధ, చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, తిర్లిక శ్రీనివాసరావు, తోటపల్లి సోమశేఖర్, బేదపూడి రాజేశ్వరి, 31వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు జి.స్వరూప్, మిడసల మధు బాబు, బండారు శ్రీరాములు, కొమ్ము రవి, బండారు మల్లికార్జునరావు, విసు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, రమాకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.



పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

నవరత్నాలతో ప్రతి ఇంటా సంతోషం

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాలలో ఘనంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

పెద్దదోర్నాల: నవరత్నాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. మండల కేంద్రంలోని క్రిష్టియన్ కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని అన్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, డీఎల్‌డీఓ సాయికుమార్, పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, దూదేకుల కార్పొరేషన్ డైరక్టర్ ఖాశింపీరా, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు పఠాన్ వహాబ్‌ఖాన్, మండల నాయకులు గంటా గురవారెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, పరుచూరి శీతారామయ్య పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

విద్యే విలువైన ఆస్తి



ఉపకారవేతనాలు పొందిన విద్యార్థినులతో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: విద్యే విలువైన ఆస్తి అని, దానిని అందివ్వడం ద్వారానే పేద కుటుంబాల పేదరికాన్ని తరిమికొట్టడం సాధ్యపడుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక ఎంహెచ్‌ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ నిర్వహించిన గ్రామీణ బాలికలకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం రూపుమాపాలన్నా, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలన్నా అందుకు విద్యే కీలకం అని గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక నిర్ణయాలు నేడు తీసుకుంటున్నారన్నారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకంటే దీటుగా మార్చారని, నేడు ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా పెరుగుతోందన్నారు. తన భర్త, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి కూడా ఇదే విధంగా ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఆశించేవారన్నారు. ప్రస్తుతం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి కూడా ప్రతి ఏటా గ్రామీణ బాలికలకు ఉపకార వేతనాలు అందిస్తుండడం అభినందనీయం అని అన్నారు. జీవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు తమ సంస్థ పట్ల చూపించే ఆదరణే తమ సంస్థ గణనీయమైన స్థానంలో ఉండేందుకు కారణమన్నారు. అటువంటి రైతు కుటుంబాలకు అండగా ఉండాలని, బాలికా విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే తాను ప్రతి ఏటా ఉమ్మడి ప్రకాశంలోని 56 మండలాల్లో మండలానికి ఇద్దరు చొప్పున ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రూ.5 వేలు, రూ.3500లు చొప్పున ప్రతి మండలంలో ఇద్దరికి వెరసి 56 మండలాల్లో రూ.4.76 లక్షలు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొన్న డీఈవో బి.విజయ భాస్కర్ మాట్లాడుతూ ఒక వైపు ప్రభుత్వ ప్రోత్సాహం, మరో వైపు విద్యాదాతల ప్రోత్సాహం ఎక్కువ ఉన్న నేటి తరుణంలో పేదరికం అనే భావన మనస్సులోకి రాకుండా విద్యార్జన చేయాలని చిన్నారులకు పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: ఓటు వినియోగ విషయంలో మన ఆలోచన, ప్రవర్తనను బట్టే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ స్పందన సమావేశమందిరంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును అర్హులందరూ జాగరూకతతో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు వారి పేరు జాబితాలో ఉందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. అర్హులందరు ఓటరుగా నమోదు చేయించుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఓటింగ్ శాతం పెరిగేలా అనేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగంపై జిల్లా యంత్రాంగం వివిధ స్థాయిల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ అభిషిక్తికిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే అత్యంత శక్తివంతమైన ఆయుధం అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియలో మరింత మంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగ విషయంలో అర్హతను బట్టి బాధ్యతగా ప్రవర్తిస్తానని కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ దిశగా ఎన్నికల కమిషన్ రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. నూతనంగా ఓటరుగా నమోదు చేయించుకున్నవారికి గుర్తింపు కార్డులను అతిథుల చేతులమీదుగా అందించారు. సీనియర్ సిటిజన్లు, ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్నవారిని ఈ సందర్భంగా సన్మానించారు.

కార్యక్రమంలో డీఆర్‌వో బి.చిన ఓబులేసు, పలువురు జిల్లా అధికారులు, సుపరిపాలన వేదిక అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఓటు హక్కు పొందిన యువతికి ఓటరు కార్డు అందజేస్తున్న జిల్లా జడ్జి ఏ.భారతి, కలెక్టర్ దినేష్ కుమార్

క్లుప్తంగా

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం


యువకుని మృతదేహం

సింగరాయకొండ: రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం అయ్యప్ప నగర్ సమీపంలో లభ్యమైంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..యువకుని ఒంటిపై బులుగు రంగు చొక్కాపై పసురంగు అడ్డగీతలు, నలుగు రంగు ఫ్యాటు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రామారావు తెలిపారు.

పోక్సో కోర్టు ప్రత్యేక జడ్జిగా ఎంఏ సోమశేఖర్

ఒంగోలు: పోక్సో కోర్టు ప్రత్యేక జడ్జిగా ఎంఏ సోమశేఖర్‌ను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమశేఖర్ ప్రస్తుతం రెండో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తూ పోక్సో కోర్టు జడ్జిగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. అయితే మహిళలపై జరుగుతున్న నేరాలు, చిన్నారులపై లైంగిక దాడుల కేసులను వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో సోమశేఖర్‌ను పోక్సో కోర్టు ప్రత్యేక జడ్జిగా నియమించి రెండో అదనపు కోర్టు బాధ్యతలను ఆయనకు అదనంగా కేటాయించారు. దీని వల్ల పోక్సో కేసులు, మహిళల మీద జరిగే నేరాలకు సంబంధించి అత్యధిక ప్రాధాన్యత లభించనుంది.

దర్శి ఎమ్మెల్యేకి తృటిలో తప్పిన ప్రమాదం

ముండ్లమూరు: దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కి తృటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని చింతలపూడిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాత్రి వేళ గ్రామానికి చెందిన కాటూరి చంద్రమౌళి ఇంటి వద్దకు చేరుకోగానే నూతనంగా కొనుగోలు చేసిన పాడి గేదె జనాలను చూసి తాడు తెంపుకొని జనాలపైకి వచ్చింది. అదే సమయంలో గేదెను అదుపుచేయబోయిన యజమాని చంద్రమౌళికి, ఎమ్మెల్యేకి ముందు ఉన్న పసుపుగల్లు ఎంపీటీసీ దాసరి పెద అంజయ్యపైకి దాడి చేసింది. దీంతో వారిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే తేరుకున్న ఎమ్మెల్యే గేదె నుంచి తప్పించుకొని పక్కకు వెళ్లారు. దీంతో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. గేదె జనాలపైకి పరుగులు తీయగా అధికారులు, ప్రజలు చెల్లాచెదురుగా పరుగులు తీశారు.

ప్రమాదాల నివారణకు దోహదపడండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

చీమకుర్తి: చీమకుర్తి నుంచి రామాయపట్నంకు గ్రానైట్ రాళ్ల రవాణా చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఒంగోలు డీఎస్పీ యూ.నాగరాజు వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో పోర్టుకు గ్రానైట్ రాళ్ల రవాణా చేసే వాహనదారులు, డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల చీమకుర్తి నుంచి ఒంగోలు మీదుగా రామాయపట్నం మధ్య రాకపోకల సందర్భంగా జరుగుతున్న పలు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు పోగొట్టుకోవడం, మరికొంత మంది క్షతగాత్రులు కావడంతో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ ఈ సమావేశం ఏర్పాటు చేశారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో రోడ్డు కూడళ్ల, ట్రాఫిక్‌లో ప్రజలకు ఇబ్బంది లేకుండా నడపాలని, అతి వేగాన్ని నియంత్రించాలని, ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు పీఎఫ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

ఒంగోలు: ప్రైవేట్ సంస్థలు, పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి ప్రావిడెంట్ ఫండ్ సమస్యలకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సమ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 27న ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమం స్థానిక ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశమందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగుల , యాజమాన్యాల, పెన్షనర్లు కూడా తమ సమస్యలు తెలియజేయాలన్నారు.

బలంగా సాక్ష్యాలు.. 8 కేసుల్లో శిక్షలు

- ఎస్పీ చొరవతో వేగంగా లైంగిక దాడి, హత్య కేసుల దర్యాప్తు
- ఏడాదిలోనే 8 కేసుల్లో శిక్షలు ఖరారు..

ఒంగోలు టౌన్: జిల్లాలో బాలికలు, మహిళలపై హింస, లైంగిక దాడి కేసులను ఎస్పీ మలికా గర్గ్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. పోక్సో, లైంగిక దాడుల కేసులను స్వయంగా పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో సిబ్బందికి దిశా నిర్దేశం చేయడం వల్ల గత 13 నెలల కాలంలో 8 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. గిద్దలూరు పోలీసుస్టేషన్ పరిధిలోని అంబవరం గ్రామానికి చెందిన బాలికను దగ్గరి బంధువు ఒకరు లైంగిక దాడి చేసి హత్య చేశాడు. 2021 జూన 8న జరిగిన ఈ కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ బుధవారం ఒంగోలు పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ ఘటనలో వెంటనే స్పందించిన ఎస్పీ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించడమే కాకుండా భౌతిక ఆధారాలను సేకరించి, బలమైన సాక్ష్యులు సేకరించేలా దిశా నిర్దేశం చేశారు. దిశ డీఎస్పీకి విచారణ బాధ్యత అప్పగించారు. నిందితుడిని 48 గంటల్లోనే అరెస్టు చేసి వాస్తవాన్ని రాబట్టారు. వీలైనంత త్వరగా నిందితుడికి శిక్షించాలనే ఉద్దేశంతో కేసును లైంగిక నేరాల చట్టం కింద కాకుండా పిల్లల రక్షణ చట్టం(పోక్సో)–2012 కింద కేసు నమోదు చేశారు. దీంతో గత ఫిబ్రవరి నుంచి నేటి వరకు మొత్తం 8 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి.

- 2013 ఆగస్టు ఒకటిన పెద్దారవీడు పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళపై లైంగిక దాడి, హత్యాయత్నం జరిగింది. ఈ కేసులో కోర్టులో సరైన సాక్ష్యాలు ప్రవేశపెట్టడంతో 2022 ఫిబ్రవరి 10న నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు.
- ముండ్లమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017 జూన్ 17న ఒక మహిళపై లైంగిక దాడి జరిగింది. ఈకేసులో విచారణ జరిపిన అదనపు జిల్లా న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ 2022 మే 11న తీర్పు ఇచ్చారు.
- 2018 ఫిబ్రవరి 3న మార్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై లైంగిక దాడి జరగ్గా..ఈ కేసులో నిందితునికి జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ 2022 జూన్ 8న తీర్పు ఇచ్చారు.
- 2022 మే 6న పెద్దారవీడు పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. కేసులో 2022 నవంబర్ 28న నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష విధించారు.
- 2021 నవబంర్ 15న గిద్దలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గిరిజన మహిళ హత్య జరిగింది. ఈ కేసును విచారించిన అదనపు జిల్లా న్యాయమూర్తి 2022 డిసెంబర్ 5న నిందితుడికి జీవితఖైదు విధించారు.
- పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 మార్చి 5న బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసు నమోదైంది. కేసులో డిసెంబర్ 26న నిందితునికి మరణించేంత వరకు కఠిన కారాగార శిక్ష విధించారు.
- సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016 అక్టోబర్ 2వతేదిన ఒక మహిళను మోసగించి లైంగిక దాడి కేసులో ఈ నెల 6వ తేదీన నిందితునికి పదేళ్ల జైలుశిక్ష విధించారు.


పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ

పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ

ఒంగోలు టౌన్: గిద్దలూరులో బాలికపై లైంగిక దాడి, హత్యకేసులో నిందితుడికి ఉరిశిక్ష కోర్టు ఇచ్చిన తీర్పు జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడానికి కృషి చేసిన అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అప్పటి దిశ డీఎస్పీ ధనుంజయుడు, ప్రస్తుత డీఎస్పీ ఎ.పల్లపురాజు, గిద్దలూరు సీఐ ఎండీ ఫిరోజ్, అదనపు పీపీ రామేశ్వరరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ వి.శ్రీరాములు, సమన్ల ఎగ్జిక్యూషనర్ పి.చెన్నకేశవరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వైవీ రామకృష్ణారెడ్డి, డాగ్ హంటర్లు ఎం వెంకటరెడ్డి, కేశకరెడ్డి, కోర్టు లైజన్ ఎస్సై వేణుగోపాల్, ఏఎస్ఐ స్వామి, పీసీ యలమందలను బుధవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. బాలిక కేసులో తక్షణమే స్పందించి చురుగ్గా వ్యవహరించడం వల్లే నిందితునికి శిక్ష పడిందని ఎస్పీ తెలిపారు. మహిళలు, బాలికల కేసుల్లో ఇదే తీరులో పోలీసు అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని కోరారు. శిక్షలు పడినప్పుడు నిందితుల్లో భయం నెలకొంటుందని, నేరాలు చేయడానికి జంకుతారన్నారు.

బీఎల్ఓ సాయిశ్రీకి రాష్ట్రస్థాయి అవార్డు

సింగరాయకొండ: జిల్లాలో నూరుశాతం ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసిన బీఎల్ఓగా గుర్తింపు సాధించిన శానంపూడి బీఎల్ఓ, గ్రామ సచివాలయ ఏఎన్ఎం నాదెండ్ల సాయిశ్రీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపికై నట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు.

పోలింగ్‌స్టేషన్ నంబర్ 235కు బీఎల్ఓగా విధులు నిర్వహిస్తున్న సాయిశ్రీ తన పోలింగ్ స్టేషన్ పరిధిలోని 669 ఓట్లకు గాను 42 మంది చనిపోగా మిగిలిన 627 ఓటర్లకు సంబంధించి పూర్తిస్థాయి ఆధార్ నమోదు చేశారు. సాయిశ్రీ ఈ అవార్డుకు ఎంపికైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు అందాయని ఆమె వివరించింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సాయిశ్రీ ఈ అవార్డును రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా చేతుల మీదుగా అందుకున్నారు. తనకు అవార్డు రావటానికి సహకరించిన తహశీల్దార్ సీహెచ్ ఉష, డీటీ తస్నీరు వెంకటేశ్వర్లుకు సాయిశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న బీఎల్ఓ సాయిశ్రీ

విజయవంతంగా గణతంత్ర వేడుకలు నిర్వహించాలి


పోలీసు పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ


గణతంత్ర వేడుకల ఏర్పాట్లు

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: 74వ గణతంత్ర దిన వేడుకలు విజయవంతంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. జిల్లా స్థాయి వేడుకలు జరిగే పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను బుధవారం ఎస్పీ మలికా గర్గ్‌తో కలిసి పరిశీలించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే అతిథుల హోదా, సంఖ్యను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు. సీట్ల కేటాయింపు, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పోలీసుల కవాతు, శకటాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్దిష్ట సమయం ప్రకారం పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను తెలియజేసేలా స్టాల్స్ ఉండాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

గణతంత్ర దినోత్సవంలో మహిళా ప్లాటూన్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగే 74వ గణతంత్ర దినోత్సవంలో పోలీసు బలగాలు, హోంగార్డులు, ఎన్‌సీసీ విభాగాల నుంచి మొత్తం 6 ప్లాటూన్లు కవాతు నిర్వహించనున్నాయి. ఈ గణతంత్ర దినోత్సవంలో మొట్టమొదటి సారిగా మహిళా ప్లాటూన్ కవాతు ప్రత్యేకంగా ఆకట్టుకోనుంది. బుధవారం కవాతు రిహార్సల్‌ను ఎస్పీ మలికా గర్గ్ పరిశీలించారు. గౌరవవందన స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల పరేడ్‌ను పరిశీలించారు. అతిథుల గ్యాలరీలు, పౌరుల గ్యాలరీ, స్టాల్స్, శకటాల ప్రదర్శన ప్రాంతాలను పరిశీలించారు. వేడుకల్లో పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, పలువురు అతిథులు హాజరు కానున్నందున తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ..దేశ ఉన్నతిని చాటిచెప్పేలా పరేడ్ కొనసాగాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాట్లను చేపడుతున్నట్లు చెప్పారు. మొదటిసారిగా మహిళా ప్లాటూన్ కవాతు చేయనుందని చెప్పారు. పురుషులతో పాటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోకబాబు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కేవీ రాఘవేంద్ర, ఆర్ఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్న కొడుకే కాలయముడై..

పుల్లలచెరువు: కన్న కొడుకు కాలయముడై తల్లిని హత్య చేసిన సంఘటన పుల్లలచెరువు మండలం తెల్లగట్ల గ్రామంలో బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే..తెల్లగట్ల గ్రామానికి చెందిన కొప్పెనబోయిన హనుమమ్మ (65) తన నాల్గవ కుమారుడు వెంకటేశ్వర్లు వద్ద ఉంటుంది. ఇటీవల కాలంలో వెంకటేశ్వర్లుకు, భార్యకు చిన్న చిన్న గొడవలు జరుగుతుండడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి వెంకటేశ్వర్లు తల్లిపై గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గొడవ జరగడంతో కత్తితో తల్లి హనుమమ్మ గొంతుపై కోయడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై వి.సుధాకర్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ మారుతీకృష్ణ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


హనుమమ్మ మృతదేహం

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

గిద్దలూరురూరల్ : ద్విచక్రవాహనం అదుపుతప్పి రైల్వే వంతనను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దిగువమెట్ట నల్లమల అటవీ ప్రాంతంలో జరిగింది. గిద్దలూరుకు చెందిన పోలయ్య(55), లింగారెడ్డిలు ద్విచక్రవాహనంపై వస్తుండగా దిగువమెట్ట నల్లమల అటవీ ప్రాంతంలో వాహనం అదుపు తప్పి రైల్వే వంతెనను ఢీకొట్టింది. ప్రమాదంలో పోలయ్య మృతి చెందగా లింగారెడ్డికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పోలయ్య మృతదేహం

తండ్రి చేతిలో కొడుకు హతం

- జులాయిగా తిరుగుతున్న కొడుకుని గొడ్డలితో హతమార్చిన తండ్రి
- వలేటివారిపాలెం మండలం అత్తింటివారిపాలెంలో ఘటన
- కేసును పక్కదారి పట్టించేందుకు పోలీసుల యత్నం
- విషయాన్ని బట్టబయలు చేసిన గ్రామస్తులు
- రంగంలోకి దిగి విచారణ చేపట్టిన పోలీస్ ఉన్నతాధికారులు
- వలేటివారిపాలెం ఎస్సైపై గతంలోనూ అవినీతి ఆరోపణలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుదర్శన్

కందుకూరు: ఓ హత్య కేసును పక్కదారి పట్టించేందుకు వలేటివారిపాలెం పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. హత్య కేసును సాధారణ ప్రమాద కేసుగా నమ్మించేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశారు. చివరికి హత్య విషయం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు చేరి అసలు విషయం బయటకు పొక్కింది. దీంతో ఆగమేఘాల మీద రంగంలోకి దిగిన స్థానిక పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

అసలేం జరిగింది...

వలేటివారిపాలెం మండలం అత్తింటివారిపాలెంకు చెందిన నడిపినేని మాలకొండయ్య, రమేష్(39) తండ్రి కొడుకులు. రమేష్ ఇంటి నుంచి వెళ్లి జులాయిగా తిరుగుతున్నాడు. వివాహమైనా చాలా కాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. అదే సమయంలో పోకూరుకు చెందిన ఓ యువతితో సహజీవనం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇంటికి వచ్చిన రమేష్ తాను ప్రేమించిన యువతిని ఇంటికి తీసుకొస్తానంటూ తండ్రితో చెప్పాడు. అయితే ఇది ఇష్టం లేని తండ్రి ఒప్పుకునేది లేదని రమేష్‌తో వాదనకు దిగాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ప్రాంతంలో తండ్రికొడుకుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన మాలకొండయ్య గొడ్డలితో రమేష్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో రమేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇదీ వాస్తవంగా జరిగిన సంఘటన.

కథ అల్లిన పోలీసులు...

ఈ కేసును మాఫీ చేసేందుకు వలేటివారిపాలెం పోలీసులు పెద్ద కథ అల్లారు. ఈ హత్య జరిగిన రోజే అంటే మంగళవారం ఓ వ్యక్తి చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. నడిపినేని గోవిందయ్య అనే రైతు పొలంలో ఉన్న చెట్టు కొట్టేందుకు పోకూరు గ్రామానికి చెందిన ఎండ్లూరి బాబు అనే కూలీ వచ్చాడు. చెట్టుకొట్టే క్రమంలో బాబు చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. ఇతన్ని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించిన బంధువులు చికిత్స అందిస్తున్నారు. కొంచెం అటూ ఇటూగా గ్రామంలో జరిగిన ఈ రెండు సంఘటనలను ముడిపెట్టే ప్రయత్నం చేశారు పోలీసులు. తండ్రి చేతిలో హతమైన రమేష్‌ను చెట్టుపై నుంచి పడిపోయినట్లు చిత్రీకరించారు. ఈ మేరకు వలేటివారిపాలెం ఎస్సై మంగళవారం ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు.


రమేష్ చనిపోయినట్లు పోలీసులు చెప్పిన చెట్టు

యువతి ఫిర్యాదుతో....

రమేష్‌తో సహజీవనం చేస్తున్న యువతి పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రమేష్‌ని తాను రహస్యం పెళ్లి చేసుకున్నానని, ప్రస్తుతం తమకు ఒక బిడ్డ కూడా ఉందని, రమేష్‌ను చంపేశారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదే సమయంలో సదరు యువతిని రమేష్ బంధువులు తీవ్రస్థాయిలో బెదిరించినట్లు సమాచారం.

ఆగమేఘాల మీద ఖననం

జరిగిన విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు పోలీసులతో పాటు, బంధువులు అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. మధ్యాహ్నం ప్రాంతంలో సంఘటన జరగ్గా ఆగమేఘాల మీద కందుకూరు ఏరియా హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించి హడావుడిగా పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని తీసుకెళ్లారు. మంగళవారం రాత్రే గ్రామంలో అంత్యక్రియల కార్యక్రమాన్ని ముగించారు.

జిల్లా ఎస్పీకి అందిన ఫిర్యాదు

పోలీసులు ఆడిన ఈ డ్రామా మొత్తం ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా జిల్లా ఎస్పీకి చేరినట్లు సమాచారం. దీంతో అర్ధరాత్రి రంగంలోకి దిగిన పోలీస్ ఉన్నతాధికారులు కేసును మార్చినట్లు తెలిసింది. మంగళవారం రాత్రి ఎస్సై సుదర్శన్ ప్రమాద కేసుగా ప్రెస్‌నోట్ ఇవ్వగా, అర్ధరాత్రి పోలీస్ ఉన్నతాధికారులు హత్య కేసుగా మార్చారు. ఈ మేరకు ఈ హత్యతో ప్రమేయం ఉన్న రమేష్ తండ్రి మాలకొండయ్యతో పాటు, ఇతర బంధువులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం గుడ్లూరు సీఐ సుబ్బారావు పోలీస్ స్టేషన్‌లోనే ఉండి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇంత పెద్దనాటకం ఆడిన వలేటివారిపాలెం ఎస్సైను మాత్రం తప్పించేందుకు ప్రస్తుతం పోలీస్ ఉన్నతాధికారులు నానా తంటాలు పడుతున్నారు.

హత్య కేసు నమోదు చేశాం: సుబ్బారావు, గుడ్లూరు సీఐ

అత్తింటివారిపాలెంలో జరిగిన సంఘటనపై గుడ్లూరు సీఐ సుబ్బారావును వివరణ కోరగా సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు. హత్య కేసును ప్రమాదంగా ఎందుకు చూపేందుకు ప్రయత్నం చేశారని ప్రశ్నించగా సమాధానం లేదు. ప్రస్తుతం హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.